

# స్కూటర్ హో!

జె. శ్యామల

అహోబిలం కళ్ళజోడు సర్దుకుంటూ ఎకౌంట్స్‌తో కుస్తీ పడుతున్నాడు.

ఇంతలో ప్యూన్ 'మీకు లెటర్ సార్!' అంటూ ఓ కవరు ముందు పడేశాడు.

అది 'పాహిమాం' కంపెనీవారి దగ్గర్నుంచి వచ్చిన స్కూటర్ అలాట్‌మెంటుకు సంబంధించిన ఉత్తరం

'హుర్రే' దాదాపు అరిచాడు అహోబిలం.

లోపల్నుంచి ఆఫీసర్ పరుగెత్తుకొచ్చాడు.

'వాట్ హ్యాపెండ్ మిస్టర్ అహో!' అడిగాడతడు.

'నథింగ్ సర్. జస్ట్ ఐ గాట్ ఎ లెటర్ ఫ్రమ్ పాహిమాం కంపెనీ ఎబౌట్

ఫ్యూటర్ ఎలాట్‌మెంటు సర్' పెద్దగా బదులిచ్చాడు అహోబిలం.

'ఓ ఐ సీ. కంగ్రాట్స్ మిస్టర్ అహో' అంటూ షేక్‌హ్యాండ్ ఇవ్వటానికి చేయి ముందుకు చాపాడు.

ఆఫీసర్ షేక్‌హ్యాండ్ ఇచ్చాడంటే అది షేక్‌హ్యాండే చేతిని విరిచినంత పనిచేసి వెనక్కి నడిచాడు ఆఫీసర్.

'అరిచి ఎంత పొరపాటు చేశాను' అనుకుంటూ అహోబిలం చేయి ఊదుకుంటూ ఉండగానే 'ఏమోయ్ బిలం. పార్టీ ఇవ్వాల్సిందే. జేబులో కాపర్స్ లేకపోతే మన గజపతి దగ్గర అప్పు తీసుకో. కూల్ డ్రింక్సు తెప్పించు అర్జంటుగా' సెక్షన్ పెద్ద మహేశ్వరం ఆర్డరు జారీ చేశాడు.

'నాకు గోల్డుస్పాట్, నాకు లింకా, నాకు మజా' మార్కెట్‌లో దొరికే కూల్ డ్రింక్స్ పేర్లన్నీ తలా ఒకటీ చెప్పారు ప్యూన్ అవన్నీ నోట్ చేసుకుని వెళ్ళి పట్టుకొచ్చాడు.

'విష్ యు ఆల్ సక్సెస్ బిలం' కోరస్‌గా చెప్పి కూల్ డ్రింక్సుని ఆనందంగా ఖాళీచేశారు.

* * *

అహోబిలం ఉత్సాహంగా ఇంటికి వెళ్ళాడు. భార్య తలుపు తెరిచీతెరవగానే 'మనకు ఫ్యూటరొచ్చిందే జ్ఞానం' అన్నాడు. ఆమె వెంటనే 'మీకెన్నిసార్లు చెప్పాను నన్ను ప్రసూన అని పిలవమని. జ్ఞానం, అజ్ఞానం అంటూ అదేం పిలుపు?' గట్టిగా విసుక్కుంది.

'అబ్బ ఏదో ఒకట్లేవే. ఎన్నాళ్ళ నుంచో ఫ్యూటరో అని కలవరిస్తున్నానని చెబితే విసుక్కుంటావేం జ్ఞానం' అన్నాడు.

ఇంక అతనికేం చెప్పినా లాభం లేదనుకుని 'ఏదీ లెటర్' అంటూ అతని చేతిలోంచి లాక్కుని గబగబా చదివింది.

'ముందు డబ్బు ఏర్పాట్లు చూసుకోండి. ఫ్యూటర్ నేర్చుకోమని ఎన్నాళ్ళ నుంచి మొత్తుకుంటున్నాన్నేను. ఏంచేసినా ఇప్పుడెలా? టిఫిన్ తిని వెంటనే పారానాథ్ దగ్గరికి వెళ్ళండి. ఆయన నేర్పుతాడు.

(పారానాథ్ అసలు పేరు పారనాథ్. వాళ్ళ నాన్నగారు హిస్టరీ లెక్చరర్ కావటంతో ఆయనకా సబ్జెక్టు అంటే వల్లి మాలిన భక్తి. అందుకే పిల్లలకు పారనాథ్, నాగార్జున్, అమరావతి అని పేర్లు పెట్టుకున్నాడు). అహోబిలం గబగబా టిఫిన్ తిని పారనాథ్ యింటికి వెళ్ళాడు.

* * *

'ఏమన్నారండీ పారానాథ్‌గారు. నేర్పుతామన్నారా?' ప్రసూన భర్తని ఆత్రంగా అడిగింది.

'ఆయనేమంటాడు. నేర్పుతానన్నాడు. చాలా మంచివాడు పాపం' అన్నాడు అహోబిలం.

'అయితే ఇంకేం రేపట్నుంచీ వెళ్ళండి జాగ్రత్తగా నేర్చుకోండి.' చిన్నపిల్లలకు

చెప్పినట్లు చెప్పింది జ్ఞానప్రసూన.

'మా ఆఫీస్‌లో కూడా ఎవరన్నా అడుగుతాలే. ఏసుపాదం చాలా మంచి వాడు. ఎవరు ఏమడిగినా కాదనడు. ఆయన దగ్గర కూడా కొంత నేర్చుకో వచ్చు' ఆలోచనగా అన్నారు అహోబిలం.

* * *

ఓ ఆదివారం నాటి సుప్రభాతాన అహోబిలానికి ఏసుపాదం స్కూటర్ నేర్పుతున్నాడు.

'చూడండి బిలంగారూ' స్కూటర్ మీద పడుతుందని భయపడకండి. ముందు కిక్ కొట్టండి' ఎలా కొట్టాలో చూపించాడు.

అతి కష్టంమీద కిక్ కొట్టాడు అహోబిలం. కాలు బెణికినంత పనైంది.

'హ్యాండిల్‌లో ఉన్న స్కూటర్‌ను క్లచ్ గట్టిగా పట్టుకుని ఎడంచేత్తో ఫస్ట్ గేర్ వేయండి. క్లచ్ నెమ్మదిగా వదుల్తూ కుడిచేత్తో ఏక్సిలరేటర్ ఎక్కువచేయండి' వివరించాడు ఏసుపాదం.

కాని అహోబిలం మాత్రం సైకిల్ పట్టుకున్నట్లు క్లచ్‌ని, ఫ్రంట్ బ్రేక్‌ను గట్టిగా పట్టుకుని, కింద బ్రేక్ మీద కాలు నొక్కిపట్టి ఉంచాడు అహోబిలం.

స్కూటర్ యథాస్థానంలో నిశ్చలంగా ఉంది. ఏసుపాదం సహనాన్ని కూడగట్టుకుంటూ 'మీరలా అన్నీ గట్టిగా పట్టుకుంటే స్కూటర్ ఎక్కాల్సిన పనేం ఉండదు: ఎంచక్కా రెండుకాళ్ళమీదే నడవొచ్చు' పరిహాసంగా అన్నాడు.

అహోబిలానికి సిగ్గుగా అనిపించి ఏక్సిలరేటర్ ఒక్కసారిగా పెంచేసి క్లచ్‌ని కూడా అమాంతం వదిలేశాడు. అంతే!

స్కూటర్ పెద్ద జెర్క్‌తో ముందుకు దూకింది. ఏసుపాదం రెండోగేర్ వేయమని మొత్తుకుంటున్నాడు.

'ఫస్ట్‌గేర్‌కే ఇంత జెర్క్ వచ్చింది. ఇంక రెండో గేరే! అమ్మో!' అన్నాడు అహోబిలం.

అహోబిలానికేమో కాని నేర్పినందుకు ఏసుపాదానికి మంచి ఎక్స్‌పీరియన్స్ వచ్చేసింది. మొత్తానికి స్కూటర్‌ను కిక్ కొట్టడం, స్టాండ్ వేయటం, కొంచెంగా హ్యాండిల్ చేయడంవరకు వచ్చేసింది అహోబిలానికి.

* * *

ఓ చల్లని సాయంకాలంలో షారావాత్ అహోబిలానికి స్కూటర్ నేర్పుతున్నాడు.

వాతావరణం చల్లగా వున్నా అహోబిలానికి మాత్రం లోపల్నుంచీ వణుకు పుట్టుకొస్తోంది.

ఏ చిన్న మొక్కను చూసినా, రాయిని చూసినా బండిని అమాంతం ఆపేస్తున్నాడు. ధారాపాతంగా చెమటలు కక్కుతున్నాడు.

'అహోబిలంగారూ! ముందుకు నెర్వస్

నెప్ వదిలిపెట్టాలండీ. చస్తాం, చస్తాం అనుకుంటే ఒక్క నిముషం కూడా నడవ లేం. అలాగే రోడ్డుమీద ప్రతివాడికీ భయపడి వెనక్కి తగ్గితే ఆఫీసుకు చేరుకునేటప్పటికి సాయంత్ర మవుతుంది. వీలయినంతవరకు న్యాక్‌గా ఓవర్‌టేక్ చేస్తూ వెళ్ళిపోవాలి.

అహోబిలానికి ఈ పాయింట్ ఏమంత నచ్చకపోయినా 'తను నేర్చుకోవడం ముఖ్యం' అన్న జ్ఞానం మాట గుర్తొచ్చి బుద్ధిగా తలూపాడు. ఆ డ్రైవింగ్‌లోనే ఇసుకలో నడుపుతుంటే ఒక్కసారిగా బ్యాలెన్స్‌తప్పి స్కూటర్ ఓ పక్కకు ఒరిగింది. ఇద్దరికీ కొంచెంగా ఒళ్ళు గీరుకుపోయింది.

అహోబిలానికి ముచ్చెమటలు పట్టాయి. పారనాధ్ 'మరేం ఫీలవకండి ఇలాంటివెన్నో జరుగుతాయి పట్టించుకో కూడదు' భుజంతడుతూ ధైర్యం చెప్పాడు.

ఇద్దరూ స్కూటర్ ఏమన్నా పాడయిందేమో అని పరిశీలించారు.

'హమ్మయ్య. స్కూటర్‌కేం కాలేదు' తృప్తిగా నిట్టూర్చాడు అహోబిలం.

'ప్చ్. అదుగో అక్కడ గీతలు పడనే పడ్డయ్' మనసులోనే నిట్టూర్చాడు పారనాథ్.

* * *

ఓ మంచిరోజున అహోబిలం, పారానాథ్ కలిసివెళ్ళి స్కూటర్ తెచ్చారు. స్వీట్లు పంచాడు అహోబిలం.

ఆ సాయంత్రం స్కూటర్‌ను నడిపించుకెళ్ళి దగ్గరగా ఉన్న గుళ్ళో పూజ చేయించాడు. 'ఏదీ ఓసారి నడపండి. కాస్త దూరమేగా' జ్ఞానప్రసూన ముచ్చటగా అడిగింది.

'అమ్మో. ఈ మెయిన్‌రోడ్ మీదే. నీకు తెలీదులే. లైసెన్స్ కూడా లేదు. ఇంకొన్ని రోజులు పోయాక నడుపుతా' అన్నాడు.

జ్ఞానప్రసూన చిన్నబుచ్చుకుంది. 'స్కూటర్‌ను అసహ్యంగా నడిపించుకు తీసుకెళ్ళడమేంటి? అయినా ఎందుకైనా మంచిది. తను బలవంతంచేస్తే ఏమైనా జరిగితే? అమ్మో! వద్దులే' అనుకుంది.

* * *

అహోబిలం రోజూ పొద్దునే స్కూటర్ రైడింగ్‌కెళ్తున్నాడు.

'రోజూ ఒకటే రూట్‌లో వెళ్తే ఏం ప్రయోజనం. అన్ని రూట్లలో నడపండి' సలహా ఇచ్చింది జ్ఞానప్రసూన.

అప్పట్నుంచీ అహోబిలం ఒక్కో ఏరియాలో తనకు తెలిసినవాళ్ళ ఇళ్ళకు వెళ్ళి వస్తున్నాడు. అతని డ్రైవింగ్ చూసి 'అతనెలా ఇల్లు చేరుతాడా!' అని వాళ్ళు భయపడటమూ జరుగుతోంది.

'ఏడుగంటల్లోపలే తిరిగొస్తారేంటి? ఇలా అయితే ట్రాఫిక్‌లో నడపటం ఎప్పటికొస్తుంది? అసలీ జన్మకు నడిపేదుందా, లేదా! ఎదురింటి చక్రపాణిగారిని

చూడండి స్కూటర్ కొని మూణ్నెల్లన్నా కాలేదు. మూడువేల కిలోమీటర్లు తిరిగా రట. మీరేమో రోజుకు ఒక కిలోమీటరు నడుపుతుంటే ఎప్పటికొస్తుంది స్కూటర్ వచ్చి యిన్నాళ్ళయింది. నన్నుగానీ, పిల్లల్నిగానీ ముచ్చటగా తీసుకెళ్ళిందే లేదు. మా అక్క' మండిపడ్డది జ్ఞాన ప్రసూన.

అహోబిలానికి రోషమొచ్చింది 'స్కూటర్ నడపటం ఏమన్నా బ్రహ్మ విద్యా, ఏమిటి? చూస్తూవుండు. ఏదో ఓరోజు నేనూ బ్రహ్మాండంగా నడిపేస్తా అన్నాడు.

'అదే, ఏరోజూ అంట! నిలదీసింది అదే సమయమని.

'సరే ఇవాళ బుజ్జిని టాంక్ బండ్‌కు తీసుకెళ్తా సరేనా!'

'హమ్మయ్య! అంతవరకైనా ఒప్పుకున్నందుకు సంతోషించింది.

బుజ్జిని ఎక్కించుకుని బయల్దేరాడు అహోబిలం.

'గట్టిగా పట్టుకో బుజ్జీ! వెనక లారీలు, బస్సులొస్తే నాతో చెప్తూండు' అన్నాడు.

'సరే నాన్నా' బుజ్జి అహోబిలం చెప్పినట్టే వెనక్కి చూసి వాహనాల రాక గురించి హెచ్చరిస్తోంది.

అహోబిలం అతిజాగ్రత్తగా నడిపి తిరిగి ఇల్లు చేరాడు.

అప్పటిదాకా కంగారుపడుతూ కూచున్న జ్ఞాన ప్రసూన క్షేమంగా తిరిగొచ్చిన వాళ్ళను చూసి 'ఫర్వాలేదు! మా ఆయనా నడపగలడు' కొంచెంగా గర్వపడింది.

* * *

'జ్ఞానం. ఇప్పుడు నిన్ను తీసుకెళ్తా పద. అలవాటయితే పగలు వెళ్ళొచ్చు' ఓ రాత్రి అన్నాడు అహోబిలం.

'సరే పదండి' జ్ఞానం ఎక్కి కూచుంది. అహోబిలం స్కూటర్ స్టార్ట్ చేశాడు. అది అష్టవంకర్లు తిరిగింది.

జ్ఞానం గుండె దడదడలాడింది. ఎదురుగా వస్తున్న రిక్షావాడు వింతగా చూస్తున్నాడు. జ్ఞానకి కోపం, అవమానం, భయం కలగలిపి చిర్రెత్తింది.

'చాల్లెండిహ. ఆపేయండి' అంది.

బండి ఆపాడో లేదో విసవిసా నడుస్తూ ఇంటికెళ్ళింది. వెనక్కి వచ్చాడు అహోబిలం.

'నా కొంప. నే న్నడుపుతా చూడు, చూడు అన్నది ఇందుకేనా' అరిచింది జ్ఞానం.

'అదికాదు జ్ఞానం నువ్వేమో పైగా కూర్చున్నావ్. బుజ్జయితే కాళ్ళు అటూ ఇటూ వేసి కూచునేది. నువ్విలా కూచునే సరికి నాకు అలవాటులేక బ్యాలెన్సు కుదరలా. అయినా నువ్వు కూడా బుజ్జిలాగా కూచోకూడదూ!' అమాయకంగా అడిగాడు.

'ఛీ.ఛీ. సిగ్గులేకపోతే సరి ఆడవాళ్ళు అలా ఎలా కూచుంటారు. అందులోనూ

చీర కట్టుకొని అవ్వ! ఎవరైనా వింటే నవ్విపోతారు, స్కూటర్ ఎక్కకపోతే పీడాపోయింది కానీ నే మాత్రం చస్తే అలా కూచోను' ఖండితంగా చెప్పింది జ్ఞానం.

* * *

మరోవారం గడిచింది. ఓ శుభ ముహూర్తంలో జ్ఞానాన్ని ఎక్కించుకుని స్కూటర్ నడపసాగాడు అహోబిలం.

అప్ రాగానే పూర్తిగా స్లోచేశాడు.

స్కూటర్ ఆగిపోయింది.

'దిగు, దిగు' అన్నాడు.

వచ్చే కోపాన్ని అణుచుకుంటూ దిగింది జ్ఞానం మళ్ళీ స్టార్ట్‌చేసి 'ఎక్కు' అన్నాడు.

ఎక్కింది. స్కూటర్ ఓ పదడుగుల దూరం వెళ్ళగానే ట్రాఫిక్ సిగ్నల్స్ వచ్చేసరికి అహోబిలం క్లచ్ గట్టిగా పట్టుకుని ఆపాడు.

తీరా గ్రీన్‌లైట్ వెలిగేసరికి అహోబిలం బండిని పూర్తి మినిమమ్‌లో ఉంచడంతో ఆగిపోయింది.

వెనకాల హారన్లు శపిస్తున్నయ్.
జ్ఞానం తలొంచుకు దిగింది.

వెనకవాళ్ళు పక్కనుంచి విసుగ్గా ఓ చూపువిసిరి ముందుకు దూసుకు పోయారు.

అహోబిలం తాపీగా స్టార్ట్‌చేసి 'ఎక్కు' అనేటప్పటికి రెడ్‌లైట్ వెలిగింది జ్ఞానం ఉస్సురంది.

'ఛీ! ఏం మనిషి మీరు ఈసారి బండి ఇలా ఆపేశారంటే నే చస్తే మళ్ళీ బండి ఎక్కను.'

'ఈ కాస్తకే అంత విసుగెందుకు? సేఫ్టీ ముఖ్యం' అంటూ తిరిగి స్టార్ట్ చేశాడు.

* * *

ఇంటికి రాగానే 'ఎలా వుంది మనం స్కూటర్ నడపటం' కాలర్ ఎగరేస్తూ అడిగాడు అహోబిలం.

'బాల్లేంది సంబరం. నడిపినంత సేపూ ఎద్దుబండిని నడిపినట్టు 'హెయ్. తప్పుకోండి పక్కకు' అంటారేంటి. హారన్ స్విచ్ నొక్కలేరూ? బ్లింకర్స్ ఉండగా చేత్తో సైడ్ చూపిస్తారేంటి?'

'నీకు తెలీదులే జ్ఞానం. వాళ్ళలా అడ్డంగా వచ్చేసరికి నాకు కోపమొస్తుంది. హారన్ నొక్కాలనీ తోచదు. నాకు తెలీకుండానే అరిచేస్తాను.'

'ఏంటో మీదంతా విచిత్రం. అందరు క్షణాల్లో రయ్యమని వెళ్ళిపోతారు. మీరే మీటో లెఫ్టూ, రైటూ అంటూ రోడ్డు దాటించి కానీ స్టార్ట్ చెయ్యరు. మన వాకిట్లో కాకుండా ఎదురువాకిట్లో స్కూటర్ ఎక్కటం నాకు అవమానంగా ఉంది' అంది జ్ఞానం.

'నువ్వు ప్రతిదానికీ అలాగే అంటావ్. అసలు రూల్ ప్రకారం ఎప్పుడూ లెఫ్ట్‌లోనే ఉండాలి. రైట్ సైడ్ నుంచి స్టార్ట్ అయితే వెనక నుంచి ఎవడన్నా వచ్చి గుద్దితే మనగతి ఏంటి? చెదపపోవాలు

కొట్టడం నాకు చిరాకు.

అసలు మినిమమ్ స్పీడ్‌లో నడపటమే గొప్ప. స్టడీగా బండి నడపటం చాలామందికి రాదు తెలుసా?

జ్ఞానానికి అహోబిలం మాటలేం వచ్చలేదు. మౌనంగా అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

* * *

ఇంతలో డ్రైనేజీవాళ్ళు, వాటర్ వర్క్స్‌వాళ్ళు, టెలిఫోన్‌వాళ్ళు మూకుమ్మడిగా కూడబల్కుని రోడ్డు మధ్య ఓ పెద్దగొయ్యి తవ్వారు. 'వన్ వే' అని బోర్డు పెట్టారు. దాంతో అహోబిలానికి వేరే గతుకుల రోడ్డే శరణ్యమయింది.

పైగా చుట్టూ సినిమాహాళ్ళు. జనప్రవాహం. అయిదు నిముషాల దూరానికి అరగంట పడుతోంది. ఇక లాభంలేదని అహోబిలం మరో రోడ్డుని కనిపెట్టి అటు వెళ్ళాడు. కొద్దిదూరం పోగానే ముక్కులు బద్దలుచేస్తూ డ్రైనేజీ నీరు సెలయేరులా ప్రవహిస్తోంది.

వెనక్కి వెళ్ళిపోదామనుకున్నాడు. కాని వెనకాల వాహనాల హారన్ల రొద. కొద్దిగా బండిని స్లో చేశాడు. అంతే! అతని పక్కనుంచి వాహనాలన్నీ ఝామ్మని వెళ్ళడం. ఆ మురుగునీటి సెలయేరు అహోబిలాన్ని అభిషిక్తుణ్ని చేయడం కనురెప్పపాట్లో జరిగిపోయింది.

అహోబిలానికి ఈ ప్రపంచం మీదే అసహ్యం వేసింది. తిట్టుకుంటూ వెనక్కి తిరిగి ఇంటికి ఇంకో అయిదు కిలోమీటరు చుట్టూ తిరిగివెళ్ళాడు.

తీరా చూస్తే ఇంటిరోడ్డులో కూడా ఇందాకటి డ్రైనేజీ నీరు ఉపనదిగా ప్రవహిస్తూ దర్శనమిచ్చింది.

ఈ దేశాన్ని, జనాన్నీ ఎవ్వరూ బాగు చేయలేరు. వచ్చే జన్మంటూ ఉంటే ఈ దర్టీ కంట్రీలో చస్తే పుట్టకూడదనుకున్నాడు అహోబిలం.

* * *

ఏడాది తర్వాత—

అహోబిలం యమస్పీడ్‌లో స్కూటర్ నడుపుతున్నాడు. లెఫ్టూ, రైటూ అన్న మాటే లేదు. పైగా ఎదుటివాణ్ని—

'పాగర్ హోగయా క్యా! మర్‌నా చాహతేతో పానీమే డుబ్ జావ్. స్లీపింగ్ పిల్స్‌తో. మగర్ సడక్ కే బీచ్‌మే మత్ ఆవో' అని దబాయించి వాడు జవాబిచ్చే లోపలే దూసుకుపోతున్నాడు.

రాజధాని రహదారుల్లో అహోబిలం స్కూటర్‌ని రాకెట్‌లా నడుపుతుంటే వెనకాల కూచున్న జ్ఞానప్రసూన ఆంజనేయదండకం అంతకంటే స్పీడుగా చదువుతోంది. *